
క్లుప్తంగా

గ్రామాల్లో పరిశుభ్రత ప్రతీ ఒక్కరు పాటించాలి



గూడూరు: గ్రామంలో ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటిస్తూ ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి పెంచాలని, పచ్చదనంగా చూసుకోవాలని ఎంపీడీఓ వీరస్వామి అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో ఆదివారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంపై గ్రామంలో నిర్వహించే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, కోమండ్ల రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవీన్‌కు డాక్టరేట్



కురవి: మండలంలోని బంచరాయితండా గ్రామానికి చెందిన బానోత్ నవీన్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగంలో ఆచార్య కున్‌సోత్ శ్రీను మార్గనిర్దేశంతో తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లా తిప్పంపట్టి, సున్నంపట్టి ప్రాంతాల్లో దొరికే 'అరుదైన కార్బోనైట్రేట్ అగ్నిశిలల నుంచి లభ్యమయ్యే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'పై పరిశోధనకు గానూ డాక్టరేట్ పట్టా పొందినట్లు శ్రీను తెలిపారు.

వృద్ధుడిపై దాడి.. కేసు నమోదు

డోర్నకల్: వృద్ధుడిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని దాన్యతండాకు చెందిన 70ఏళ్ల వృద్ధుడు బాదావత్ ఫకీరాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా వీరంతా స్థానికంగానే ఉంటున్నా తండ్రిని పట్టించుకోవడం లేదు. తండ్రికి భోజనం పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తుండగా గత నెల 30న మనవడు నవీన్‌తోపాటు అతడి భార్య అఖిల ఫకీరాపై దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్య తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

గార్ల: కేరళ రాష్ట్రంలోని వరద బాధితుల కుటుంబాలకు విరాళాలు ఇచ్చి అండగా నిలవాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కవిత, హరి, ఇమ్మడి గోవింద్, అలువాల సత్యవతి, నాగమణి, రమ, వీరస్వామి, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలి



దంతాలపల్లి: పద్మశాలీల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా కోశాధికారి పెండం రమేష్ అన్నారు. సంఘం ఎన్నికల్లో భాగంగా తొర్రూరు డివిజన్ పరిధిలో గల ఏడు మండలాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో మండలకేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేయబోతున్న వల్లకాటి రాజుకు మద్దతునిస్తు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండబత్తిని జగదీశ్వర్, సంఘం మండల అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు, వెన్నం జనార్దన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మృతిచెందిన కుటుంబాలతోపాటు ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. ముందుగా మండలంలోని మధనాపురంలో కాంగ్రెస్ కార్యకర్త లింగాల యాదవరెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే పాడె మోసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన భీరవెల్లి ప్రేమలతారెడ్డి అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యే మురళీనాయక్ మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

రేపటితో ముగియనున్న పాలన

- నేడు జెడ్పీ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు
- ఇప్పటికే మండల పరిషత్‌లో ప్రత్యేక అధికారులు
- స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే..



జిల్లా పరిషత్ కార్యాలయం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు మాదిరిగానే త్వరలోనే జిల్లా పరిషతుల్లో కూడా ఖాళీలు కానున్నాయి. జిల్లా పరిషత్‌లోకి ప్రత్యేక అధికారులు రానున్నారు. ఈనెల 6న మంగళవారంతో జిల్లా పరిషత్‌లో జెడ్పీటీసీల పదవీకాలం ముగియనున్నది. ఇప్పటికే గ్రామ పంచాయితీల్లో సర్పంచుల, ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది.

మానుకోట జిల్లా నూతనంగా ఏర్పడటం, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రెండు మండలాలు మానుకోట జిల్లాలో కలిశాయి. జిల్లాలో 2019 మే 19న జెడ్పీటీసీ, ఎంపీపీల ఎన్నికలు జరిగాయి. జూన్‌లో కౌంటింగ్ పూర్తియింది. ఎంపీపీలు ప్రమాణ స్వీకారం చేశారు. కానీ జిల్లా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నికపై జెడ్పీటీసీల ప్రమాణస్వీకారం నెల ఆలస్యమైంది. తమ సభ్యులు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ కావాలని అంతలోనే జిల్లాలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు పావులు కలిపారు. ఈసందర్భంలో నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీలందరిని మూకుమ్మడిగా ప్రత్యేక టూర్ ప్యాకేజీకి తీసుకెళ్లారు. ఇలా చైర్‌పర్సన్ పదవీపై ఉత్కంట నెలకొంది. ఇక్కడ జరుగుతున్న విషయం మొత్తం బీఆర్ఎస్ నాయకులు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలను, మంత్రులను పిలిపించి చైర్‌పర్సన్ ఎన్నికపై అందరిని ఒక తాటికి తీసుకువచ్చి సద్దుమణిగించారు. దీంతో నూతన చైర్‌పర్సన్, 16మండలాల జెడ్పీటీసీ సభ్యులు 2019 ఆగస్టు7న ప్రమాణస్వీకారం చేశారు. దీంతో పాలకవర్గం ఏర్పడింది. రేపటితో జిల్లా ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం ముగియనున్నది. నేడు జెడ్పీ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 1గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ నర్మద తెలిపారు.

ప్రజల మధ్యనే ఉంటా..



నిధులు వచ్చాయి కానీ చెక్ పవర్ లేకపోవడంతో పూర్తిస్థాయిలో అనుకున్న రీతిలో పనులు చేయాలుకపోయాం. ఉన్న ఈజీఎస్ ఫండ్ దుర్వినియోగం అయ్యింది. పదవీ ఉన్న లేకపోకపోయిన ప్రజల మధ్య నిరంతరం ఉండి, ప్రజాసమస్యలపై పోరాడుతా.

– మంగళపల్లి శ్రీనివాస్, తొర్రూరు జెడ్పీటీసీ

వాగ్దానాలు అమలు చేశా..



ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, పనులను కొంత మేరకు చేశాం. కోవిడ్ రావడంతో జెడ్పీ నిధులు అప్పటి ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించి మెరుగైన వైద్యం అందించింది. ఆరునెలల జీతం డబ్బులను స్వయంగా కోవిడ్ చికిత్స మేరకు రూ.50వేలు ప్రభుత్వానికి అందజేశా. ప్రజా సేవల్లో ఉంటా..

– గుగులోతు సుచిత్ర, గూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు

ప్రజాకళల పండుగను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

నెహ్రూసెంటర్: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే ప్రజాకళల పండుగను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. ప్రజానాట్య మండలి జిల్లా సమితి సమావేశం జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో అజ్మీర వేణు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో కళాకారులు తమ కలం, గళం ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సాంస్కృతి విభాగం ద్వారా కొంత మందికి మాత్రమే ఆదుకుని వేలాది మంది కళాకారులను విస్మరించారన్నారు. ప్రభుత్వం కళాకారులను ఆదుకుని నెలకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాకళల పండుగకు అధిక సంఖ్యలో కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, నాయకులు కట్లోజు పాండురంగాచారి, కేదాసు రమేష్, మామిండ్ల సాంబలక్ష్మీ, పులి యాకయ్య, ఎండి అలీమా, కళాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు న్యాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల లబ్ధిదారులకు రూ.76.49లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరి ఆర్థిక ఇబ్బందులు పడిన పేదలకు ప్రభుత్వం తరపున ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, మండలాల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్‌రెడ్డి, ముద్దసాని సురేష్, నాయకులు చిత్తలూరి శ్రీనివాస్, మేకల కుమార్, కందాడి అశోక్‌రెడ్డి, జాటోతు రవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న సురేందర్

మహబూబాబాద్ రూరల్: బీజేపీని సంస్థాగతంగా బలపరచాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ అన్నారు. పార్టీ మానుకోట రూరల్ మండల కార్యవర్గ సమావేశం వేమునూరు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సురేందర్ హాజరై మాట్లాడుతూ.. కార్యకర్తలందరూ కలిసి శ్రమించి రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. అందుకోసం ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో పార్టీపై ప్రజల్లో అభిమానం పెరిగేలా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలను గాలికి వదిలేసి మంత్రులు, ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో జల్సాలు చేస్తున్నారన్నారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేసి గ్రామాల అభివృద్ధి జరగాలంటే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మారగాని రాజుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సతీష్, హుస్సేన్, గోవర్ధన్, శ్రీనివాసు, జంపాల మహేష్, సురేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఎమ్మార్పీఎస్ స్వాగతిస్తుందని, వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం ఎలేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణకు మద్దతు ప్రకటించారని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లుపెట్టి ఆమోదించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాను చేపట్టామని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, రాధా, సుధారాణి, బాలకృష్ణ, ఉపేందర్, భాస్కర్, తకాంతి, శ్రీదేవి, పద్మ, సరోజ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో అక్రమ డిపప్యుటేషన్లు రద్దు చేయాలని, డీఈఓను తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు సంజీవ, ప్రవీణ్ కుమార్, సభ్యులు హరినాయక్, సురేష్, కుమార్, మైసయ్య, బాబు పాల్గొన్నారు.

తొర్రూరు: జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లికుదురు: ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్న విషయాన్ని తెలుసుకున్న మండల వైద్యశాఖ ఆదివారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పలు కాలనీల్లో స్ప్రే చేసి వ్యాధులు రాకుండా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, మండల వైద్యాధికారి బి.నందనాదేవి, వెంకన్న, సంధ్యారాణి, వినీత్, యాకయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గార్ల: మండలంలోని పూసలతండాకు చెందిన విద్యార్థి భూక్యా శివలాల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం శివలాల్ తల్లిదండ్రులకు రూ.20వేల ఆర్థికసాయం అందజేసి, మానవత్వం చాటుకున్నారు.

'స్నేహం అపురూప అనుబంధం'



తొర్రూరు: స్నేహితుల దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న సీఐ సంజీవ, తదితరులు



మహబూబాబాద్ రూరల్: వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ రూరల్: వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ మాలె యోగేశ్వరరావు, అధ్యక్షుడు ఈగ శ్రీనివాస్, సదాశివుడు, నవీన్ కుమార్, మాశెట్టి అంబరీష, వేణుగోపాల్ పాల్గొన్నారు.

తొర్రూరు: స్నేహం ఓ అపురూప అనుబంధమని సీఐ సంజీవ అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీఐ కేక్ కట్ చేసి స్థానికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జగదీష్, నిర్వాహకులు కల్లూరి నాగేంద్రాచారి, గోపారపు నాగేశ్వరరావు, రాజమౌళి, దామెర సరేష్, కృష్ణప్రసాద్, రాజమౌళి, శ్రీనివాసాచారి, కృపాకర్‌రాజులు పాల్గొన్నారు.



డోర్నకల్: స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డోర్నకల్: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం డోర్నకల్ రైల్వే హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. అప్సర్, గోలి సతీష్‌కుమార్, మండలోజు శ్రీనివాస్, మన్యు పాట్ని, యుగేందర్, వినయ్ పాల్గొన్నారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న1993-94 బ్యాచ్ విద్యార్థులు



కేసముద్రం: 1996-97 బ్యాచ్ విద్యార్థులు



మహబూబాబాద్ రూరల్: 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జెడ్పీఎస్ఎస్ స్కూల్ 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అనంతారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు.

కేసముద్రం: ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మండల కేంద్రంలోని హరిహర గార్డెన్స్‌లో కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. అలాగే జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1993–94 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్, యాకాంతంగౌడ్, చంద్రశేఖర్, ట్రెజరర్ సత్యనారాయణ, కరుణాకర్ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండలంలో 5లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపాడు. మండంలోని తూర్పుతండాలో గుగులోత్ బికోజీ ఇంటిలో సోదాలు నిర్వహించగా, 5లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లంపానకం దొరికిందన్నారు. బెల్లం పానకం ధ్వంసం చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలపాడు. బికోజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అభినందనీయం

మరిపెడ రూరల్: పశువైద్యాధికారిగా డాక్టర్ రమేష్ చేసిన సేవలు అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నూకల శ్రీరంగారెడ్డి అన్నారు. మండలంలోని ఎడ్జెర్ల పశువైద్యాధికారిగా విధులు నిర్వహించిన రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిత్తనూరి అనుషవెంకన్న, బానోతు రమేష్, నాయకులు గోపి మధుసూదన్, వీరన్న, బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

గూడూరు: గ్రామీణ ప్రాంతాలలో ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా చూసుకోవాలని డాక్టర్ చౌకిధార్ రవీందర్ అన్నారు. మండలంలోని ఏపూరులో ఆదివారం నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ మరియు శుశృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రూ.2లక్షల విలువైన మందులను అందించారు.

అనుమతి లేని సర్వీసులతో అధిక లోడు

మరిపెడ రూరల్: అనుమతి లేని విద్యుత్ మోటార్ల సర్వీసులు వాడకం మూలంగానే ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడి కాలిపోతున్నాయని ఎల్లంపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ బి.అజయ్ అన్నారు. ఆదివారం ఏఈ మాట్లాడుతూ.. డీడీలు కట్టి విద్యుత్‌ను వినియోగించుకోవాలని రైతులకు గతంలోనే అనేక మార్లు హెచ్చరించామన్నారు. అయినప్పటికి కొందరు రైతులు వినకుండా కెపాసిటికి మించి అక్రమంగా విద్యుత్ వాడుతున్నారని ఆరోపించారు.

వాహనాల తనిఖీ

కురవి: మండల కేంద్రం శివారులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదురుగా కురవి ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు.

మద్దతు ఇవ్వాలి

దంతాలపల్లి: కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు సంపెట సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కొంత మంది నాయకులతో కలిసి ప్రత్యక్షంగా రాజకీయాలలో ఉంటూ, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేశానన్నాడు. యువతకు న్యాయం చేయడం కోసం యూత్ మండల అధ్యక్షుడిగా బరిలోకి దిగానన్నారు. మండంలోని యువత, నాయకులు సపోర్టు చేయాలని కోరాడు.

పరామర్శ

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డిల కుమారుడు రోహిత్‌రెడ్డి ఇటీవల అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సన్మానం



మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల గ్రామంలో జిల్లా పరిషత్ నిధుల ద్వారా సెంట్రల్ లైట్ ఏర్పాటు, డ్రెయినేజీ నిర్మాణ పనులను జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్ పాషా ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన్ను గ్రామ ప్రత్యేక అధికారి ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి సుందర్ సన్మానించారు. కార్యక్రమంలో అవుల వెంకన్న, తప్పెట్ల వెంకన్న, సుధాకర్, వెంకటేష్, గిరిబాబు, ముత్తయ్య పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ

గార్ల: ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా శ్రీరామదండు 108 కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గార్ల పట్టణంలోని పలు వార్డుల్లో, సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిరుపేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, మనోజ్‌కుమార్, కమల్ ఉపేందర్‌రెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గార్ల: జిల్లాలోని వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చింతనూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం గార్లలోని కృష్ణతార ఫంక్షన్ హాలులో జరిగిన టీయూడబ్ల్యూజే మండల ప్రథమ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ప్రత్రిక రంగానికి విశేషంగా కృషి చేసి ప్రాణాలర్పించిన షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎస్సై జీనత్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీహరి, రవి పాల్గొన్నారు. అనంతరం ఐజేయూ మండల అధ్యక్షుడిగా నేలం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిగా రూపన్ శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

108లో ప్రసవం



డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన చింతల ప్రియాంకకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వాహనంలో ప్రియాంకను తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ షమీనా, ప్రియాంకకు ప్రసవ సమయంలో వైద్య సేవలు అందించారు.

నాయకుడి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బ పద్మ భర్త, బీఆర్ఎస్ నాయకుడు వెంకటరెడ్డిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని కురవి ఎస్సై బైరు గోపి ఆదివారం తెలిపారు. ఓ భూమి క్రయవిక్రయాలు, భూతగాదా విషయంలో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఎంగలి నిర్మల అనే మహిళ ఫిర్యాదు చేయగా విచారణ జరిపి వెంకటరెడ్డిని అరెస్టు చేశామన్నారు.

గుడిసెల కూల్చివేతపై ఫిర్యాదు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్తి రెడ్డి గార్డెన్స్ సమీపంలో గౌతమ బుద్ధ కాలనీ గుడిసెల కూల్చివేతపై టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కాలనీ నిర్మాణ బాధ్యుడు సురుగు అయిలయ్య అన్నారు. ఆదివారం అయిలయ్య మాట్లాడుతూ.. నిరుపేద పేదలు గౌతమ బుద్ధ కాలనీ పేరిట గుడిసెలు వేసుకొని ఐదు ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నామన్నారు. ప్రభుత్వ భూమి కావడంతో గత ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు పలుమార్లు గుడిసెలు తొలగించారని తెలిపారు. మహిళలు, చిన్నపిల్లలు అని చూడకుండా వారిపై దాడి చేశారన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం, రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.